సాక్షి
పార్వతీపురం మన్యం

ఆదివారం । 10 । ఆగస్టు । 2025



మందుల కొరత!

పశు ఆరోగ్య సంచార వాహనాలు అలంకార ప్రాయంగా గ్రామాలకు వెళ్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. - 8లో



వంద కేజీల గంజాయి పట్టివేత

ఒడిశా నుంచి తమిళనాడుకు 100 కేజీల గంజాయిని అక్రమంగా రవాణ చేస్తుండగా బొండపల్లి పోలీసులు పట్టుకున్నారు. - 8లో



అధికారుల బదిలీలపై ఆగ్రహం

పాలకొండ సబ్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ సిన్హ, పార్వతీపురం ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవను బదిలీచేయొద్దని గిరిజన జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. - 8లో

కొండగుడిలో ఆదివాసీ పండగ

గిరిజన నాయకులను ఆదర్శంగా తీసుకోవాలి: కలెక్టర్



అడవితల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

సీతంపేట/పార్వతీపురంరూరల్: జిల్లాలోని సీతంపేట, పార్వతీపురం ఐటీడీఏల ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. గిరిజన సంప్రదాయ నృత్యాలు, వేషధారణలు,డప్పువాయిద్యాలు అలరించాయి. ముందుగా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డితో పాటు అధికారులు, నాయకులు సీతంపేట అడ్వెంచర్ పార్కు నుంచి ఐటీడీఏ వరకు ర్యాలీ చేశారు. ఐటీడీఏ ముఖద్వారం వద్ద ఉన్న అడవితల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటుచేసిన స్టాల్స్ పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ గిరిజనుల కోసం నిరంతరం పోరాడి అమరులైన గిరిజన నాయకులు బిర్సాముండా, అల్లూరి సీతారామరాజు, కొమరం బీమ్ వంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జీవితంలో ఉన్నస్థాయికి ఎదగాలంటే విద్యార్థులంతా బాగా చదువుకోవాలన్నారు. సీతంపేట ఐటీడీఏ నుంచి టెన్త్ విద్యార్థినికి స్టేట్‌ఫస్ట్ రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గిరిజనులు ఆరోగ్యం పట్లశ్రద్ధ వహించాలన్నారు. నాటుమందుల జోలికి పోవద్దన్నారు. ప్రసవానికి ముందే గర్భిణులు వైటీసీలో ఏర్పాటుచేసిన ప్రత్యేక హాస్టల్‌కు చేరుకోవాలన్నారు. ఏడాది పొడవునా దిగుబడి వచ్చే పంటలను ఎంపిక చేసుకోవాలన్నారు. అనంతరం టెన్త్, ఇంటర్‌లో ప్రతిభకనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అలాగే క్రీడలు, నృత్యాలు చేసిన వారిని అభినందించారు. కార్యక్రమంలో పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి, ఏపీఓ చిన్నబాబు, డీఎంఅండ్‌హెచ్ఓ భాస్కరరావు, ఎంపీపీ బి.ఆదినారాయణ, మార్కెట్‌కమిటీ చైర్మెన్ సంధ్యారాణి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.భూదేవి, గిరిజన నాయకులు కె.సుబ్బారావు, ఎం.రవికుమార్, ప్రమోద్, ఎం.భాస్కరరావు, కె.కాంతారావు, స్పోర్ట్స్ ఇన్‌చార్జి జాకాబ్‌దయానంద్, ఏఎంఓ కోటిబాబు, జీసీడీఓ రాములమ్మ పాల్గొన్నారు.

ఆదివాసీ వారసత్వాన్ని కాపాడుకోవాలి

పార్వతీపురం ఐటీడీఏ ప్రాంగణంలో నిర్వహించిన ప్రపంచ ఆదావాసీ దినోత్సవంలో పీఓ అశుతోష్ శ్రీవాత్సవతో పాటు ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి, కురుపాం ఎమ్మెల్యే టి.జగదీశ్వరీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ ఆదివాసీ వారసత్వాన్ని కాపాడుకోవల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వసతిగృహాలకు మరిన్ని సౌకర్యాలు కల్పించాల్సి ఉందని, 10, ఇంటర్ పరీక్షల ఫలితాల్లో జిల్లా విద్యార్థుల ప్రగతి రాష్ట్రంలో మొదటి వరుసలో ఉందంటే ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయుల కృషి ఫలితమేనన్నారు. ఎస్పీ మాట్లాడుతూ గిరిజనుల జీవన విధానం ఎంతో సంప్రదాయంగా ఉంటుందని, అమాయకపు గిరిజనులు కొంతమంది అత్యాసపరుల మాటలు విని సారా, గంజాయి వంటి అక్రమ రవాణాల్లో భాగస్వాములై కటకటాలపాలవుతున్నారన్నారు. మాదకద్రవ్యాల రవాణాకు దూరంగా ఉండాలని సూచించారు.



సీతంపేటలో బాలికల థింసా నృత్యం



గిరిజన బాలికలతో కలిసి థింసా నృత్యం చేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



ఉరిపిరి ఆశ్రమ పాఠశాల విద్యార్థినుల గిరిజన నృత్యప్రదర్శన

న్యూస్‌రీల్

తహసీల్దార్ కార్యాలయాలను నిర్మించాలి

- ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వరులు



విలేకరులతో మాట్లాడుతున్న ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వరులు

పార్వతీపురం రూరల్: రాష్ట్రంలో శిథిలావస్థకు చేరిన 108 తహసీల్దార్ కార్యాలయాలను, 26 ఆర్డీఓ కార్యాలయాలను కొత్తగా నిర్మించాలని ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వరులు ప్రభుత్వాన్ని కోరారు. పార్వతీపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద పార్వతీపురం మన్యం జిల్లా రెవెన్యూ భవనానికి కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌తో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రెవెన్యూ పరమైన సేవలను పారదర్శకంగా, మెరుగ్గా అందించేందుకు సిద్ధంగా ఉన్నామని, దానికి తగ్గట్టుగా వసతులు కల్పించాలని కోరారు. సిబ్బంది కొరత ఉన్నచోట కొత్తగా నియామకాలు చేపట్టాలని, కొన్నిచోట్ల మహిళలకు మరుగుదొడ్లు కూడా లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతి తహసీల్దార్ కార్యాలయం నిర్వహణకు ప్రతినెల ప్రభుత్వం ఇస్తున్న రూ.200లు ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. కొత్తగా విధుల్లో చేరిన సిబ్బందికి, పదోన్నతులపై విధుల్లోకి వచ్చే అధికారులకు శిక్షణ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటరాజేష్, ఏపీఆర్ఎస్ఏ, ఏపీజేఏసీ అమరావతి జిల్లా అధ్యక్షుడు గొట్టాపు శ్రీరామమూర్తి, రాష్ట్ర కో–చైర్మన్ డీజీ ప్రసాదరావు, వర్క్‌చార్జ్‌డ్ ఉద్యోగుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌరునాయుడు, జిల్లా కోశాధికారి పీఎస్ఎల్ కుమార్, తహసీల్దార్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పీఓ పనితీరుపై ఆరా...

సీతంపేట: ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి పనితీరుపై పలువురు అధికారులు, సిబ్బందికి ఐవీఆర్ఎస్ కాల్స్ వస్తున్నాయి. పీఓ పనితీరు సంతృప్తికరంగా ఉందా? ఉంటే ఒకటి నొక్కండి, లేదు అంటే 2 నొక్కండి అంటూ సర్వే చేస్తున్నారు. పాలకొండ సబ్‌కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనకు ఐటీడీఏ పీఓగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. సబ్‌కలెక్టర్ స్థానంలో ఇటీవల పవర్ స్వప్నిల్ జగన్నాథ్‌ను నియమించారు. ప్రస్తుత సర్వేతో ఆయనను ఐటీడీఏ పీఓగా పూర్తిస్థాయిలో నియమిస్తారా?, లేదంటే ఎక్కడికైనా బదిలీ చేస్తారా అనేది చర్చనీయాంశంగా మారింది. అయితే, ఉత్తమ పనితీరు ప్రదర్శిస్తున్న పీఓపై ఐవీఆర్ఎస్ కాల్స్‌తో సర్వే చేయడంపై ఉద్యోగ వర్గాలతో పాటు ప్రజలు విస్మయం చెందుతున్నారు.

12న మెగా జాబ్ మేళా

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాల సంయుక్త నిర్వహణలో ఈ నెల 12న స్థానిక కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తామని ఆ సంస్థ జిల్లా మేనేజర్ జి.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమా, డిగ్రీ, బీటెక్, పీజీ కోర్సులలో ఉత్తీర్ణులైన 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసున్న అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఈ జాబ్ మేళాకు 16 బహుళ జాతి కంపెనీలు హాజరై అభ్యర్థులను ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు 'నైపుణ్యం.ఏపీ.జీఓవీఐఎన్' వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని, ఆ రోజు ఉదయం 9 గంటలకు కాలేజీ ప్రాంగణంలో హాజరుకావాలని సూచించారు.

పీఏసీఎస్‌లపై కూటమి కినుక

విజయనగరం అర్బన్: పీఏసీఎస్‌లపై కూటమి ప్రభుత్వం కినుకవహిస్తోంది. రైతుకు అండగా ఉండాల్సిన సహకార సంఘాలు నిర్వీర్యమవుతున్నాయి. ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహకాలు అందడం లేదు. రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో సహకార కమిటీలు వేసి నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తున్నారే తప్ప ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికల నిర్వహణకు చొరవచూపడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. త్రీమెన్, ఫైవ్‌మెన్ కమిటీలతో రైతులకు తూతూ మంత్రంగా సేవలు అందిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఇదీ పరిస్థితి..


ఉమ్మడి విజయనగరం జిల్లాలో 94 సహకార సంఘాలు ఉన్నాయి. వాటికి మొన్నటి వరకు త్రిసభ్యకమిటీలుండేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాది కాలంగా కమిటీలను వేయలేదు. ఐదేళ్లకోసారి ఎన్నికలు జరుగుతూ ఉంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వ్యవసాయరంగం అభివృద్ధికి ప్రత్యేక నిధులు వచ్చేవి. పాలకవర్గాలు లేకపోవడంతో ఈ నిధులు మంజూరుకావడం లేదు. నిధులు రాక రైతులకు అందించే రుణాల్లో రాయితీలు దక్కని పరిస్థితి. వ్యవసాయ రంగానికి తోడ్పాటును అందించేలా పంపిణీ చేసే ఎరువులు, పురుగు మందులు, యంత్ర పరికరాలు, పనిముట్లను రైతులు పొందలేకపోతున్నారు.

కూలిన ఆడలి వ్యూ పాయింట్ సైడ్ వాల్

- త్రుటిలో తప్పిన ప్రమాదం
- భారీ వర్షానికి క్యాంటీన్‌పై జారిపడిన రాళ్లు
- నాణ్యతాలోపమే కారణమా?



కూలిన ఆడలి వ్యూ పాయింట్ సైడ్‌వాల్



క్యాంటీన్ వెనుకభాగంలో పడిన రాళ్లు, మట్టి

సీతంపేట: నిత్యం సందర్శకులతో కళకళలాడే ఆడలి వ్యూపాయింట్ వద్ద సైడ్ వాల్ శుక్రవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి కుప్పకూలింది. గోడ రాళ్లు, మట్టి క్యాంటీన్‌కు కొద్ది దూరంలో జారిపడ్డాయి. క్యాంటీన్‌లో నిదిరిస్తున్న యువకులు భయాందోళనతో పరుగుతీశారు. గోడరాళ్లు క్యాంటీన్‌పై పడితే ప్రమాదం జరిగి ఉండేదని చెబుతున్నారు. టికెట్లు ఇచ్చే గేటు నుంచి పైకి వెళ్లే మార్గంలో గోడ ఉంది. అక్కడ నుంచి మరికొద్ది దూరంలో కిందన క్యాంటీన్, ఇంకాస్త కిందన వ్యూపాయింట్ ఉంది. ప్రస్తుతం కూలినగోడ వద్ద నుంచి నిల్చుని చూస్తే వ్యూపాయింట్ కనిపిస్తుంది. అదృష్టవశాత్తు రాత్రి సమయం కావడం, పర్యాటకులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. దాదాపు రూ.2 కోట్ల వ్యయంతో గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మాణాలు జరిగాయి. నాణ్యతలోపం వల్లే సైడ్ వాల్ కూలిందని పర్యాటకులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ఆడలికి వెళ్లే మార్గంలో ద్విచక్రవాహనాలు, ఆటోలతో పలు ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

వీఆర్‌ఏల వేతనాలు పెంచాలి

- 18న ఎమ్మార్వో కార్యాలయాల వద్ద ధర్నాకు పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న వీఆర్‌ఏ సంఘం నాయకులు

విజయనగరం గంటస్తంభం: వీఆర్‌ఏల వేతనాలు పెంచాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు కె.గురుమూర్తి డిమాండ్ చేశారు. ఎన్‌పీఆర్ శ్రామిక భవన్ సీఐటీయూ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు బి.సూర్యనారాయణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత ఎనిమిదేళ్లుగా వీఆర్‌ఏలకు జీతాలు పెంచకపోవడం దారుణమన్నారు. వీఆర్‌ఏలను రెగ్యులర్ వీఆర్‌ఏలుగా గుర్తించాలని, అర్హులైన వారికి నాలుగో తరగతి ఉద్యోగులుగా పదోన్నతులు ఇవ్వాలని, జాబ్ చార్ట్‌లో లేని పనుల నుంచి వీఆర్‌ఏలను మినహాయించాలని, 010 జీఓ కింద జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 18న ఉదయం 10 గంటలకు జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వీఆర్‌ఏ జిల్లా సంఘం నాయకులు రాంబాబు, రమణ, లక్ష్మణరావు, చంద్రరావు, రమణ, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

రూ.3 కోట్లా.. వెంకటేశా..!

అమ్మకానికి ఉద్యోగాలు..?

- టీడీపీ నాయకులకు 30 శాతం కమీషన్
- అమరావతి నుంచి కిందస్థాయి అధికారుల వరకు కుమ్మక్కు?
- బయట పడిన ఇద్దరు టీడీపీ నాయకుల ఆడియో సంభాషణ
- పోస్టులు అమ్మేస్తే.. చదువుకునేవారికి ఇంకెలా ఉద్యోగాలు వస్తాయంటూ నిరుద్యోగుల నిట్టూర్పు

సాక్షి, పార్వతీపురం మన్యం:

ఆమె: 3 సీఆర్ (రూ.3కోట్లు) రెడీగా ఉంది. ఎరేంజ్మెంట్ చేయమనండి. మన దగ్గర ఉండడం ప్రమాదం. నేను సాయంత్రం వారి దగ్గరికి వెళ్లి మీకు ఫోన్ చేస్తాను. మీరు మాట్లాడితే చాలు.

అతను: నేను ఏం మాట్లాడాలో చెప్పు... వారిని డబ్బులు పట్టుకుని ఉండమను.

ఆమె : ఏం మాట్లాడతారు.. పర్సంటేజీ. డబ్బులు మన దగ్గరే ఉన్నాయి.. 3 సీఆర్!

అతను: పర్సంటేజ్ 30 అని చెప్పాను.. వీరికి 15.. మనకు 15 ఉంటుంది.

ఆమె : రెండు, మూడు రోజుల్లో పార్వతీపురం నుంచి క్యాష్ పట్టుకెళ్లమనండి. మనం అయితే అంత పట్టుకెళ్లలేం. మీకు అర్థం కావడం లేదు.

ఆమె : ఇప్పుడే ఆమెకు ఫోన్ చేశాను. అమ్మా ఈ జాబ్ ఎవరు వేయిస్తున్నారని అడుగుతున్నారు. 'సూపరింటెండెంట్ గారా.. వెంకటేష్ గారా.. నువ్వా..' అని అడిగారు. నేను సైలెంట్‌గా ఉన్నాను.



ఇదీ.. టీడీపీకి చెందిన ఇద్దరు వ్యక్తుల మధ్య ఫోన్ సంభాషణ. చిన్నచిన్న కాంట్రాక్టుల నుంచి ఉద్యోగాల వరకూ.. అవకాశం ఉన్న ఏ దారినీ వదలని టీడీపీ నాయకులు, కార్యకర్తలు.. పలు ఉద్యోగాల భర్తీ విషయంలో రూ.3 కోట్లకు బేరం పెట్టినట్లు ఆ ఫోన్ సంభాషణలో స్పష్టంగా ఉంది. అవి ఏ పోస్టులు? ఇది ఎప్పుడు జరిగిందన్న విషయాలు వారి సంభాషణలో స్పష్టంగా తెలియనప్పటికీ.. అంత పెద్ద మొత్తంలో ఇచ్చే పోస్టులు ఏమై ఉంటుంది.. అన్నది తెలియాల్సి ఉంది. ఆ సంభాషణలో ఉన్న మహిళ గతంలోనూ పలువురిని మోసం చేసి, కేసులు ఎదుర్కోవడం గమనార్హం. పోస్టులను పార్వతీపురం మన్యం జిల్లాలోని యువకుడికి ఇప్పించడంలో ముగ్గురు వ్యక్తులు కీలకంగా ఉన్నట్లు తెలుస్తోంది. సూపరింటెండెంట్.. వెంకటేశ్ అనే పేర్లను ప్రస్తావించగా... ఆ మొత్తం అందరికీ పంచాలని, అమరావతిలో పైస్థాయి నుంచి చేయించుకుని వచ్చామని మహిళతో మరో వ్యక్తి చెప్పడం విశేషం. సదరు యువకుడి తల్లి.. ఆ మొత్తం ఇచ్చేందుకు అంగీకరించినట్లు అర్థం అవుతోంది. అనుకున్న మొత్తం సర్దుబాటు కాలేదని, తర్వాత అందజేస్తానని సూపరింటెండెంట్‌కు ఫోన్ చేసి.. ఆ మహిళ (డబ్బులిచ్చే పార్టీ) అడిగితే ఏం చేద్దాం అని టీడీపీకి చెందిన మహిళ అనుమానం వ్యక్తం చేయగా.. ఇలాంటి విషయాలు ఫోన్లో అధికారులతో మాట్లాడవద్దని, వారికి ఇబ్బందులు ఉంటాయని చెప్పాలని రెండో వ్యక్తి బదులిచ్చాడు. లేకుంటే.. పోస్టుమన్‌కి చెప్పి ఆ లెటర్ (అపాయింట్‌మెంట్ ఆర్డర్) ఆపించేద్దామా? అని ఆమె అంటే.. వద్దని ఆయన తెలిపాడు.

అంగట్లో పోస్టులు

కూటమి ప్రభుత్వం హయాంలో పోస్టులన్నీ అంగట్లో వస్తువులుగా మారాయి. గతంలో అంగన్‌వాడీ వర్కర్ పోస్టును రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ విక్రయించుకున్నారని పలువురు బాధితులు పీజీఆర్ఎస్‌లో వినతి పత్రాలు అందించారు. రేషన్ డీలర్లు, విద్యుత్ శాఖలో కాంట్రాక్టు పోస్టులు, పలు విభాగాలలో తాత్కాలిక పోస్టులకు రేటు కట్టేసి.. తమ వారికి కట్టబెట్టారు. ఉపాధి హామీ పథకంలో క్షేత్ర సహాయకులు, చివరికి పాఠశాలల్లో భోజన పథక కార్మికులు, ఆయాలను సైతం వదలలేదు. ఉద్యోగుల బదిలీల్లోనూ ప్రజాప్రతినిధుల సిఫార్సులెటర్లకు సొమ్ము చేతులు మారిందన్న విమర్శలున్నాయి. ఇప్పుడు ఏకంగా రూ.3 కోట్లకు ప్రభుత్వ ఉద్యోగాలను బేరం పెట్టారు అంటే.. అవి ఎంత పెద్దపోస్టులు? ఆ స్థాయిలో పోస్టులు అప్పనంగా ఎలా కట్టబెడుతున్నారు? అలాగైతే నిజాయితీగా ఏళ్లతరబడి ఉద్యోగాల కోసం రాత్రీపగలు చదువుతున్న నిరుద్యోగుల పరిస్థితి ఏమిటన్న వాదన వినిపిస్తోంది. పార్వతీపురం మన్యం వంటి మారుమూల ఉన్న జిల్లా నుంచి రూ.3కోట్ల తరలింపునకు, అది కూడా ట్రస్టులు, వ్యాపార సంస్థల పేరుమీద మళ్లించే మాస్టర్‌మైండ్ ఏర్పాట్లు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. విజిలెన్స్ అధికారులు దృష్టిసారిస్తే ఈ ఉద్యోగాల వెనుక ఉన్నవారు ఎవరు, వారి అవినీతి తంతు బయటపడుతుందని, ఉద్యోగాల అమ్మకానికి చెక్ పెట్టడంతో పాటు నిరుద్యోగులకు మేలు జరుగుతోందన్న అభిప్రాయం సర్వత్రావ్యక్తమవుతోంది. అధికారబలానికి భయపడి ఈ అవినీతి తంతును విడిచిపెడతారా... లేదంటే నిజాయితీగా దర్యాప్తుచేసి అవినీతిపరులకు కళ్లెం వేస్తారా? అన్నది వేచిచూడాల్సిందే.



పూర్తికాని ఆర్ఓబీ పనులు

నత్తనడక..!

- ప్రయాణికులకు తప్పని కష్టాలు
- తేలని రిక్షాకాలనీ సర్వీస్ రోడ్ వ్యవహారం
- పట్టించుకునే వారు లేక మందకొడిగా పనులు

చీపురుపల్లి: పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రయాణికులకు ప్రయాణకష్టాలు తప్పడంలేదు. ఆర్ఓబీ నిర్మాణం త్వరితగతిన పూర్తయితే మూడు, నాలుగు నియోజవర్గాలకు చెందిన ప్రయాణికులకు 'మార్గం' సుగమమవుతుంది. పనులు పూర్తికాకపోవడంతో పాలకొండ నుంచి విశాఖపట్టణానికి ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీసులు లేకపోవడంతో చీపురుపల్లి, రాజాం, తెర్లాం, పాలకొండ నియోజకవర్గాలకు చెందిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విజయనగరం ఎంపీతోపాటు పాలకొండ, రాజాం, బొబ్బిలి, చీపురుపల్లి నియోజకవర్గాలకు చెందిన కూటమి ఎమ్మెల్యేలు ఆర్ఓబీ పనులను పట్టించుకోవడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఏడాదిగా పనులు మందకొడిగా సాగుతున్నా స్పందించకపోవడంపై విచారం వ్యక్తంచేస్తున్నారు. గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే, మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఆర్ఓబీ నిర్మాణానికి రూ.13 కోట్లు నిధులు మంజూరు చేయించి, పనులు ప్రారంభించారు. 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన సమయానికి 70 శాతం పనులు పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పనుల్లో జాప్యం ప్రయాణికులకు శాపంగా మారింది.

తేలని రిక్షాకాలనీ సర్వీస్ రోడ్డు వ్యవహారం

చీపురుపల్లి పట్టణంలోని గాంధీబొమ్మ జంక్షన్ నుంచి రాజాం రోడ్డులో ఉన్న ఇదే ఆర్ఓబీ పక్క నుంచి రిక్షాకాలనీకి వెళ్లాల్సి ఉంది. అయితే, ఆర్ఓబీ నిర్మాణంలో భాగంగా ఉన్న డిజైన్ ప్రకారం పనులు పూర్తయితే రిక్షాకాలనీకి సర్వీస్ రోడ్ ఉండదు. రాజాం రోడ్‌లో ఉన్న ఆర్అండ్‌బీ స్థలంలో ఎంతో కాలంగా ఉన్న నిర్మాణాలను తొలగించాలి. అప్పుడే రిక్షాకాలనీకు సర్వీస్ రోడ్డు ఏర్పడుతుంది. ఆర్అండ్‌బీ ఆక్రమణలు తొలగించకుండా ఆర్ఓబీ పనులు పూర్తి చేసేందుకు గతంలో సంబంధిత కాంట్రాక్టరు సిద్ధపడగా రిక్షాకాలనీ వాసులు అడ్డుకున్నారు. అప్పటి నుంచి ఈ వ్యవహారాన్ని చక్కబెట్టే ప్రయత్నం జరగలేదు. దీంతో ఆర్ఓబీ పనులు పూర్తి కావడం లేదు.

త్వరితగతిన పనులు పూర్తిచేయాలి

"ఆర్ఓబీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి. పనులు పూర్తి కాకపోవడంతో మూడు, నాలుగు నియోజవకర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విశాఖపట్టణం వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు సర్వీసులు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పనులు ముందుకు సాగేలా చర్యలు తీసుకోవాలి."

– ఇప్పిలి నీలకంఠం, రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ మెంబర్

జెడ్పీ చైర్మన్ నివాసంలో రక్షాబంధన్ వేడుకలు



మజ్జి శ్రీనివాసరావుకు రాఖీ కడుతున్న సోదరీమణులు

విజయనగరం: ఉమ్మడి విజయగనరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు నివాసంలో శనివారం రక్షాబంధన్ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ధర్మపురిలోని సిరిసహస్ర రైజింగ్ ప్యాలెస్‌లో జరిగిన వేడుకల్లో మజ్జి శ్రీనివాసరావు సోదరీమణులు ఎం.అమృతవల్లి, ఎ.రమాదేవి, బి.పద్మలు ఆయనకు రాఖీలు కట్టి ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా మజ్జి శ్రీనివాసరావు సోదరీమణులను కానుకలు అందించి గౌరవించారు. ఆ భగవంతుని చల్లనిదీవెనలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా ఆయన ఆకాక్షించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ సతీమణి పుష్పాంజలి పాల్గొన్నారు.

క్లుప్తంగా

వట్టిగెడ్డ నీరు విడుదల



రావాడ వట్టిగెడ్డ నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

జియ్యమ్మవలస: మండలంలోని రావాడ వట్టిగెడ్డ నీటిని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శనివారం విడుదల చేశారు. నీటిని విడుదల చేయడంతో వ్యవసాయ పంపుసెట్లు లేని రైతులు ఆనందిస్తున్నారు. ఉభాలు చాలా గ్రామాలలో ఇంకా ప్రారంభం కాకపోవడంతో ఆదివారం నుంచి ఉభాలు అవుతాయని రైతులు అంటున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బొంగు సురేష్, నీటి సంఘం అధ్యక్షులు ఎం.సత్యంనాయుడు, నాయకులు డొంకాడ రామకృష్ణ, జోగి భుజంగరావు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డుల కోసం ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారి టి.విమలారాణి శనివారం తెలిపారు. విద్యా, విజ్ఞానం, కళలు, ఆటలు ఇతర రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారు దీనికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఐదు సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల లోపు వారు తాము సాధించిన వాటికి సంబంధించిన సర్టిఫికెట్లు, పత్రికల్లో ప్రచురింపబడిన క్లిప్పింగ్‌లు తదితర వాటితో అవార్డ్.జీఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎట్టకేలకు చిక్కిన నిందితుడు!

కొత్తవలస : మండలంలోని ముసిరాం గ్రామానికి చెందిన సిమ్మ అప్పారావును తన మేనకోడల భర్తయిన అనకాపల్లి జిల్లా కోటపాడు మండలం పాతవలస గ్రామానికి చెందిన సిమ్మ అప్పారావు ఈ నెల 5న నాటు తుపాకీతో కాల్చి చంపిన విషయం తెలిసిందే. కాగా నిందితుడి కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టగా ఎట్టకేలకు కశింకోట సమీపంలో పోలీసులకు శనివారం చిక్కినట్టు సమాచారం హత్య జరిగిన మరుసటి రోజు నుంచి అప్పారావు మకాం మార్చుతూ రాజమండ్రి, భద్రాచలం తదితర ప్రాంతాల్లో పోలీసుల నుంచి తప్పించుకుంటూ తిరుగుతున్నాడు. నిందితుడు తన ఫోన్‌ను ఘటనా స్థలంలోనే వదిలేసి వెళ్లిపోయాడు. అయితే పాతవలస గ్రామంలోని తన ప్రియురాలికి నిందితుడు తరచూ ఫోన్ చేస్తుండడంతో ఆమె ఫోన్‌పై పోలీసులు నిఘా పెట్టారు. సంబంధిత సిగ్నల్ ఆధారంగా నిందితుడు కదలికలను పోలీసులు గుర్తించారు. చివరికి అనకాపల్లి జిల్లా కశింకోట సమీపంలో శనివారం ఉదయం టిఫిన్ చేస్తుండగా పోలీసులు పట్టుకున్నట్టు తెలిసింది. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేస్తున్నట్టు సమాచారం. ఆదివారం కోర్టును హాజరు పర్చనున్నట్టు తెలిసింది.

మరణించి.. మరో ఇద్దరికి వెలుగునిచ్చి..



మరణించిన అచ్చియ్యమ్మ కళ్ళు తీసుకునేందుకు అంగీకారం తెలుపుతున్న కుటుంబ సభ్యులు

పెందుర్తి : అనారోగ్యంతో మరణించిన వృద్ధురాలి నేత్రాలు దానం చేసి మానవత్వం చాటుకుంది ఓ కుటుంబం. విజయనగరం జిల్లా కొత్తవలస మండలం తాడివానిపాలెం అంబేడ్కర్‌కాలనీకి చెందిన రాజాన అచ్చియ్యమ్మ(90) ఆరోగ్యం క్షీణించి శనివారం మృతి చెందారు. ఈ నేపథ్యంలో పెందుర్తికి చెందిన సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి దాడి శ్రీనివాస్, స్థానిక పెద్ద ఎం.సింహాచలం మృతురాలి కుటుంబ సభ్యులను నేత్రదానానికి ఒప్పించారు. కుటుంబ సభ్యులు అంగీకారం తెలపడంతో వెంటనే అక్కడకు చేరుకున్న ఎల్‌వీ ప్రసాద్ సారథ్యంలోని మోషిన్ ఐ బ్యాంక్ ప్రతినిధులు అచ్చియ్యమ్మ నేత్రాలను సేకరించి సురక్షితంగా ఆస్పత్రికి తరలించారు.

స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



విశిష్ట అలంకరణలో వేంకటేశ్వరస్వామి

జామి: వేంకటేశ్వరస్వామి జన్మ నక్షత్రం అయిన శ్రవణ నక్షత్రం, శ్రావణ పౌర్ణమి, శనివారం సందర్భంగా భీమసింగి సుగర్‌ఫ్యాక్టరీ వద్ద ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు గావించారు. ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాద్ ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక అలంకరణగావించి, విశిష్ట పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రసాద వితరణ గావించారు. అన్నంరాజుపేట పుష్పగిరి వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు గావించారు.

పశు ఆరోగ్య సంచార వాహనాల్లో మందుల కొరత!

- మందులు లేకుండానే గ్రామాలకు వెళ్తున్న వాహనాలు
- జిల్లాలో 13 సంచార పశు ఆరోగ్య వాహనాలు
- రోజుకు ఒకటి రెండు గ్రామాల్లోనే వైద్య శిబిరాలు
- గతంలో 1962 నంబరుకు ఫోన్ రాగానే సంబంధిత గ్రామానికి వెళ్లి సేవలు
- ఏవీ నాటి సేవలు నేడు...



గంట్యాడ సంచార పశు ఆరోగ్య సేవ వాహనం

విజయనగరం ఫోర్ట్: పశు ఆరోగ్య సంచార వాహనాలు అలంకార ప్రాయంగా గ్రామాలకు వెళ్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పశువుల చికిత్సకు అవసరమైన మందులు లేకుండానే గ్రామాలకు వెళ్తున్నట్టు తెలుస్తుంది. దీంతో పాడి రైతులు పశువుల వైద్యానికి ప్రైవేటు మందుల దుకాణాల్లో మందులు కొనుగోలు చేస్తున్నట్టు సమాచారం. గతానికి భిన్నంగా పశు సంచార ఆరోగ్య వాహనాలను నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంచార పశు ఆరోగ్య సేవ వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. పశువుల వైద్యానికి సేవలు అందించేందుకు 1962 ట్రోల్‌ఫ్రీ నంబరును కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. నియోజకవర్గానికి రెండు వాహనాలు ఉంచారు. రెండు మండలాలకు ఒక వాహనం చొప్పున వైద్య సేవలు అందించేవారు. 1962 ట్రోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ రాగానే సంబంధిత గ్రామానికి వెళ్లి పశువులకు అవసరమైన వైద్యాన్ని వాహనం వద్దే అందించేవారు. శస్త్రచికిత్సలు చేయాల్సి వస్తే దగ్గరలో ఉన్న ప్రాంతీయ పశు వైద్యశాలలకు తరలించి అక్కడ చికిత్స అందించి అనంతరం గ్రామానికి పంపించేవారు. విజయనగరం మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాలకు రెండు చొప్పున సంచార పశు ఆరోగ్య సేవ వాహనాలు 13 ఉన్నాయి.

వాహనాల వివరాలు

జిల్లాలో 4,75,805 పశువులు

జిల్లాలో 4,75,805 పాడి పశువులు ఉన్నాయి. ఇందులో 3,77,960 ఆవులు, 97,845 గేదెలు ఉన్నాయి. అదే విధంగా గొర్రెలు 4,48,154, మేకలు 1,56,511 ఉన్నాయి. పందులు 2,585, కోళ్లు 51,26,764 ఉన్నాయి.

గజపతినగరం నియోజకవర్గంలో - 2, చీపురుపల్లి నియోజకవర్గంలో - 2, బొబ్బిలిలో - 2, నెల్లిమర్లలో - 2, ఎస్.కోటలో - 2, విజయనగరంలో -1, రాజాంలో -2 చొప్పున పశు ఆరోగ్య సేవ వాహనాలు ఉన్నాయి.

మూగ జీవాలకు మందులు లేకుండానే..

మూగ జీవాల చికిత్స కోసం వచ్చిన సంచార పశు ఆరోగ్య సేవ వాహనాలు మందులు లేకుండానే గ్రామాలకు వెళ్తున్నాయని పాడి రైతులు అంటున్నారు. మందులు లేకుండా గ్రామాలకు వెళ్లడంతో రైతులు పశు వైద్యుడు చెప్పిన మందులు ప్రైవేటు మందుల దుకాణంలో మందులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. దీంతో రైతులకు చేతి చమురు వదులుతుంది. సంచార పశు ఆరోగ్య సేవ వాహనాలను గతంలో జీవీకే సంస్థ అందించేంది. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత భవ్య హెల్త్ ప్రొవైడర్స్ సంస్థకు అప్పగించింది.

గతానికి భిన్నంగా..

సంచార పశు ఆరోగ్య సేవ వాహనాల వివరాలను గతానికి భిన్నంగా నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో నెలకు 8 వేల నుంచి 9 వేల కిలోమీటర్ల వరకు ఒక్కో వాహనం సేవలు అందించేవి. ఇప్పుడు వాహనాలు నెలకు 3 వేల కిలోమీటర్లు కూడా తిరగడం లేదనే విమర్శలు ఉన్నాయి. అంతేకాకుండా రోజుకు రెండు మూడు గ్రామాల్లో వాహనం పెట్టి సేవలు అందిస్తున్నారు. ఒకే చోట వాహనాలను పెట్టడం వల్ల ఎక్కువసార్లు కేసుల కోసం తిరగాల్సిన పని తప్పుతుంది. అంతేకాకుండా కొన్ని వాహనాలు గ్రామాలకు వెళ్లడం లేదనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

మందులు వచ్చాయి..

సంచార పశువైద్యశాలల్లో మందుల కొరత ఉంది. అయితే ప్రస్తుతం మందులు వచ్చాయి. వాటిని సంచార పశు వైద్యశాలలకు అందజేస్తాం. ఇకపై ఇబ్బంది ఉండదు.

– డాక్టర్ దామోదర్‌రావు, జిల్లా పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు

సకల భాషలకు తల్లి సంస్కృతం



సంస్కృత భాషా ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న దృశ్యం

విజయనగరం టౌన్: సకల భాషలకు మూలం, తల్లి వంటిది సంస్కృత భాష అని వాగ్దేవి సమారాధనమ్ సంస్థ వ్యవస్థాపకురాలు, రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెన్నేటి స్వప్నహైందవి అన్నారు. సంస్కృత భాషా దినోత్సవం పురస్కరించుకుని, నగరంలోని మహారాజా సంస్కృత ఉన్నత పాఠశాలలో సంస్కృత భాషా ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న కర్రి సంతోషిలక్ష్మిని ఘనంగా సత్కరించారు. ఇదే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన డాక్టర్ ఎస్.సూర్యనారాయణ, డాక్టర్ గోటేటి హిమబిందులు మాట్లాడుతూ నేడు మానవులు మాట్లాడుతున్నటు వంటి భాషాపదాల్లో 80 శాతం సంస్కృత పదాలేనని తెలిపారు. సంస్కృతం లేకుంటే మానవ జీవన గమనం కష్టమని రామాయణం, మహాభారతం, భాగవతాలు కూడా తొలుత సంస్కృతంలోనే లభ్యమయ్యాయన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు జిల్లా జట్లు సిద్ధం



రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులతో నిర్వాహకులు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న యోగా పోటీలకు జిల్లా జట్లు సిద్ధమయ్యాయి. జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని తోటపాలెం గాయత్రీ విద్యా సంస్థల ప్రాంగణంలో శనివారం నిర్వహించిన ఎంపిక పోటీలకు అనూహ్య స్పందన లభించింది. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నిర్వహించిన ఎంపిక పోటీల్లో మొత్తం 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరికి జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు అవనాపు విక్రమ్, అల్లు నరేంద్ర, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి సిహెచ్.వేణుగోపాలరావు సమక్షంలో ఎంపికలు నిర్వహించారు. ఎంపికల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 35 మంది క్రీడాకారులను వచ్చే నెల 5, 6, 7 తేదీల్లో తాడేపల్లిగూడేంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు అవనాపు విక్రమ్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.సన్యాసిరావు, ఎస్.రవివర్మ, ఎస్.పైడిరాజు, ఎం.గౌతమి, జి.సంధ్య తదితరులు పాల్గొన్నారు.

అధికారుల బదిలీలపై ఆగ్రహం



పీవో, సబ్‌కలెక్టర్ల బదిలీలు నిలుపుదల చేయాలని గిరిజన సంఘాల నిరసన ర్యాలీ

- సబ్ కలెక్టర్, పీవో బదిలీలను నిలుపుదల చేయాలి
- గిరిజన జేఏసీ నాయకుల డిమాండ్

గుమ్మలక్ష్మీపురం: పాలకొండ సబ్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ సిన్హ, పార్వతీపురం ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీ వాస్తవకు చేపట్టిన బదిలీలను ప్రభుత్వం నిలుపుదల చేయాలని గిరిజన జేఏసీ నాయకులు కోలక లక్ష్మణమూర్తి, మండంగి రమణ, నిమ్మక సింహాచలం, బి.గౌరీశంకరరావు, బిడ్డిక పద్మ, తిరుపతిరావు, అడ్డాకుల చిన్నారావు తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వారు గుమ్మలక్ష్మీపురంలో వారి బదిలీలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబ్ కలెక్టర్‌గా యశ్వంత్ కుమార్ సిన్హ, పీవోగా అశుతోష్ శ్రీ వాస్తవ ఆదివాసీ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడంలోనూ, నిరుద్యోగ విద్యార్థుల ఉన్నత అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నారన్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో వీరిని బదిలీ చేయడం వలన ఇప్పటి వరకు గిరిజన గ్రామాల్లో జరిగిన అభివృద్ధి ఆగిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం దీన్ని గుర్తించి వీరి బదిలీలను తక్షణమే నిలుపుదల చేయాలని, లేకుంటే గిరిజనులంతా ఏకమై ఆందోళనలను తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు.

పశువుల మాంసం వ్యాన్ సీజ్



పశువుల మాంసం తరలిస్తున్న వ్యాన్‌ను సీజ్ చేసిన పోలీసులు

బొండపల్లి: బొండపల్లి మండల కేంద్రం మీదుగా శనివారం ఉదయం మూడు టన్నుల పశువుల మాంసం లోడుతో అక్రమంగా తరలిస్తున్న వ్యాన్‌ను పట్టుకుని సీజ్ చేసినట్టు ఎస్‌ఐ మహేష్ తెలిపారు. ఈ మాంసం సాలూరు నుంచి రాజమండ్రికి అక్రమంగా తరలిస్తున్నట్టు తెలిపారు. వ్యాన్‌ను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో పైడితల్లి చండీయాగం




చండీయాగం చేస్తున్న వేదపండితులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, భక్తుల పాలిట కల్పవల్లి శ్రీపైడితల్లిని ఆరాధిస్తూ స్థానిక రైల్వేస్టేషన్ దగ్గరున్న వనంగుడి, చదురుగుడి ఆవరణల్లో చండీయాగం శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితులు వెలువలపల్లి నరసింహమూర్తి, రాజేష్, సాయిలు శాస్త్రోక్తంగా పూజలు చేసి, యాగంలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి శేషవస్త్రాలు, కండువాలు అందజేశారు.

పెద్ద గెడ్డ కాలువలో మృతదేహం లభ్యం

పాచిపెంట : పెద్దగెడ్డ జలాశయం కాలువలో ఓ వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైనట్టు పాచిపెంట ఎస్‌ఐ వెంకట్ సురేష్ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సాలూరు పట్టణంలో గలగొడ వీధికి చెందిన ముంజేటి నాగేంద్రబాబు (40) ప్లాస్టిక్ కవర్లు సేకరిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు. శనివారం కాలువలో శవమై కనిపించాడు. మృతునికి మద్యం అలవాటు ఉందని మద్యం మత్తులో బహిర్భూమి కోసం వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెంది ఉంటాడని భార్య ముంజేటి ఖరీస్మా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సాలూరు సీహెచ్‌సీకి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

వైభవంగా విఖనసస్వామి జయంతి



పూజలందుకుంటున్న విఖనసస్వామి

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్య క్షేత్రం రామతీర్థంలోని శ్రీసీతారామస్వామి దేవస్థానంలో కొలువైన విఖనసస్వామి జయంతి శనివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సీతారామస్వామి వారికి ప్రాతఃకాలార్చన పూజలు నిర్వహించినానంతరం యాగశాలలో విశేష హోమాలు చేశారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా ఉత్సవమూర్తుల వద్ద స్వామివారికి నూతన యజ్ఞోపవీతధారణ చేశారు. అనంతరం వెండి మండపం వద్ద సీతారాముల నిత్యకల్యాణం కనుల పండువగా చేశారు. విఖనసస్వామికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ రకాల ఫలరసాలతో అభిషేకం చేసి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈవో శ్రీనివాసరావు, అర్చకులు పాల్గొన్నారు.

కూల్ డ్రింక్స్ వద్దు.. ఆరోగ్యమే ముద్దు



మాట్లాడుతున్న డాక్టర్ ఏవీ రాజశేఖర్

విజయనగరం గంటస్తంభం: కూల్ డ్రింక్స్ ఆరోగ్యానికి హాని కలిగిస్తాయని, ఆరోగ్యానికి హాని కలిగించే కూల్‌డ్రింక్స్ విడిచిపెట్టి మన ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే ముద్దని జనవిజ్ఞాన వేదిక జాతీయ కమిటీ కన్వీనర్ డాక్టర్ ఏవీ రాజశేఖర్ అన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ గురజాడ పాఠశాలలో శనివారం క్విట్ కూల్ డ్రింక్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ.. కూల్ డ్రింక్స్‌లో కార్బన్‌డయాక్సైడ్, ఆల్కహాల్, ఎరువులు తదితర ప్రమాదకరమైన పదార్థాలు కలుపుతారని, ఇవన్నీ ఆరోగ్యానికి ఎంతో హాని కలిగిస్తాయని అన్నారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు ఎరుకొండ ఆనంద్ మాట్లాడుతూ.. కోకో కోల, పెప్సీ వంటి విదేశీ కూల్ కూల్ డ్రింక్స్‌ను విడిచిపెట్టి మన ఆరోగ్యాన్ని, దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. మన ఇంటికి వచ్చే బంధువులకు కూల్ డ్రింక్స్‌ను ఇవ్వకుండా దాని స్థానంలో మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరినీళ్లు వంటి పానీయాలను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా కోశాధికారి షిణగం శివాజీ, గురజాడ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పూడి శేఖర్, ఆ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వంద కేజీల గంజాయి పట్టివేత



గంజాయి నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

- నలుగురు నిందితుల అరెస్టు
- పరారీలో మరో ఇద్దరు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్ : ఒడిశా నుంచి తమిళనాడుకు వంద కేజీల గంజాయిని అక్రమంగా రవాణ చేస్తుండగా బొండపల్లి పోలీసులు శనివారం పట్టుకున్నారు. షిఫ్ట్ కారులో గంజాయిని తరలిస్తున్న నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించి ఎస్పీ వకుల్ జిందల్ డీపీవోలు శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బొండపల్లి పోలీసులకు అందిన కచ్చితమైన సమాచారంతో గొట్లాం బైపాస్ రోడ్డు జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేపడుతుండగా ఒడిశా నుంచి తమిళనాడు రాష్ట్రానికి షిఫ్ట్ కారులో గంజాయిని తరలిస్తున్న ఇద్దరి నిందితుల్లో ఒకరైన ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా పొట్టంగి తాలూకా పుకలికి చెందిన మనోరంజన్ మిశ్రా(28)ని అదుపులో తీసుకున్నారు. మిశ్రా ఇచ్చిన సమాచారంతో మరో ముగ్గురు అనకాపల్లి జిల్లా పరవాడ మండలం దలాయిపాలెంకు చెందిన దలాయి రామరాజు, తగరపువలసలోని నిమ్మవానిపేట కాలనీకి చెందిన విరుమండి గోపి, తమిళనాడు రాష్ట్రం దిండిగల్ జిల్లా నర్థాంకు చెందిన పాండియం మాణిక్యంను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. మరో ఇద్దరు పియూష్ పడాలు, సుదర్శన్ భోరా పరారీలో ఉన్నట్టు చెప్పారు. కోరాపుట్ జిల్లాకు చెందిన మరోరంజన్ మిశ్రాతో కారులో గంజాయిని తరలించేందుకు రూ.20వేలు, కారును ఎంగేజ్ చేసినందుకు మరో రూ.20 వేలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారని తెలిపారు. నిందితుల నుంచి 48 ప్యాకెట్లలో ఉన్న వంద కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ కేసులో క్రియాశీలకంగా పని చేసిన గజపతినగరం సీఐ జీఏవీ రమణ, బొండపల్లి ఎస్‌ఐ యు.మహేష్, పీఎస్ సాయిరాం పడాల్, కానిస్టేబుళ్లు టి.అప్పలనాయుడు, బి.రవికుమార్, కె.అప్పారావులను ఎస్పీ వకుల్ జిందల్ అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేశారు.



గంజాయితో పట్టుబడిన నిందితులతో జీఆర్పీ, ఆర్పీఎఫ్ అధికారులు

14కేజీల పట్టివేత

విజయనగరం క్రైమ్ : స్థానిక జీఆర్‌పీ రూ.లక్ష విలువ చేసే 14 కేజీల గంజాయిని శనివారం పట్టుకున్నారు. ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఆర్‌కే రావు, జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్‌ఐ బాలాజీరావు, రమణ రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాంలపై తనిఖీలు చేస్తుండగా బరంపురం నుంచి చెన్నైకు గంజాయిని తరలిస్తున్న తమిళనాడు రాష్ట్రం తంజావూరు జిల్లా పటకొట్టాయికి చెందిన అరుణ్‌కుమార్, రాగుల్, అశోక్ మురుగన్‌లను పట్టుబడ్డారు. విచారించగా ఒడిశాలోని బరంపురం నుంచి చెన్నైకు తరలిస్తున్నట్టు వెల్లడైందన్నారు. ఈ మేరకు అరెస్టు చేసి కేసు నమోదు చేసి విశాఖ రైల్వే కోర్టుకు తరలించామని జీఆర్‌పీ ఎస్‌ఐ బాలాజీరావు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న పార్వతీశ్వరరావు

విజయనగరం క్రైమ్ : మండలంలోని జమ్ములో నివాసముంటున్న కొమ్ముర పార్వతీశ్వరరావు(32) తన ఇంట్లోనే బ్లేడ్‌తో గొంతు కోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి సంబంధించి విజయనగరం రూరల్ ఎస్‌ఐ అశోక్‌కుమార్ శనివారం తెలిపిన వివరాలు.. భోగాపురానికి చెందిన పార్వతీశ్వరరావు అదే గ్రామానికి చెందిన ఓ మహిళను వివాహం చేసుకున్నాడు. జమ్ములో ఉంటున్న పార్వతీశ్వరరావు భార్య వద్దే రూ.14లక్షలు తీసుకున్నాడు. అడిగితే ఇదిగో.. అదిగో అంటూ దాటవేయసాగాడు. ఈసారి డబ్బులు అడిగితే చనిపోతానని బెదిరించేవాడు. అయినా మళ్లీ భార్య డబ్బులు అడగ్గా కోపంతో రగిలిపోయిన పార్వతీశ్వరరావు తన భార్య, తల్లిని గదిలో బంధించి బయట గడియపెట్టి బ్లేడ్‌తో మెడపై కోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఎస్‌ఐ అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్	బ్రాయిలర్	లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
		₹110	₹190	₹200